బోల్తా!

వెంపటి నాగభూషణంగారు

౧

పడకకుర్చీలో విశ్రమించి, ఆ లోకలు ఫండు సత్రం గదిలో న్యూసుపేపరు చదువుతోంది సౌభాగ్యం. ముప్ఫైయేండ్లది పొట్టి, బొద్దుమనిషి. చామనఛాయ శరీరం. ఇమిటేషన్ పట్టు చీరె కట్టుకున్నది. కళ్లకు రోల్డు గోల్డు జోడున్నది. జుట్టు బర్మాముడి వేసింది. ముత్తానికి అంత అందకత్తని చెప్పడమునకు వీలు లేదు. విలతండము గుండెలు విచ్చునట్లుగా చేసేటందుకు ఆమెలో యేమీ కన్పడదు.

'ఏమి పనిమీద వచ్చావు?' అన్నది, పేపరు చదవడం మానివేసి, గదిలోకి ప్రవేశించిన జ్ఞానసుందరమును చూసి.

'లేదు, మరేమీ పని లేదు. ఇక్కడ తమకు సప్లయిలన్నీ అంది సౌఖ్యంగా ఉన్నదేమోనని తెలుసుకోడానికి వచ్చాను'—అన్నాడు ఆమెవంక ఓరగా చూస్తూ.

'అన్నీ సరిగానే ఉన్నాయి. ఇంతకు ముందే గోపాలం వచ్చి కనుక్కు వెళ్లాడు. సాయంకాలం మీ ఆఫీసుకు వచ్చి తనిఖీచేస్తానని చెప్పాను.'

'చిత్తం. అన్నీ సిద్ధంగానే ఉన్నాయి.'

'తరువాత, చందాల పట్టీ గ్రామంలో పెద్దలందరి దగ్గరకీ పంపాలి. అప్పుడే ఒక చందా వసూలైంది. గోపాలం అయిదు రూపాయిలు చందా వేసి యిచ్చేశాడు. మహా ఉదార స్వభావుడల్లే కన్పడుతాడు.'

ఇది వినేసరికి జ్ఞానసుందరం చలించాడు. తనకన్న ముందే గోపాలం అక్కడకు రావడము, అయిదు రూపాయిలు చందా యివ్వడము అతనికి అనుమానం కల్గించినై. వెంటనే కోపంగూడా వచ్చింది. కాని శాంతపడి, గోపాలంకంటె గొప్పవాడుగాను, దానపరుడుగాను కన్పడవలెనని నిశ్చయించుకుని అన్నాడు:

'ఈ గ్రామంలో మేమంతా ఉదారస్వభావులమే. పరోపకార కార్యములలో యెప్పుడు వెనుకంజ వేయము. అందుకి నే సాక్ష్యం'—అంటూ తన జేబులోనున్న రెండు అయిదు రూపాయిల నోట్లు మడత విప్పి ఆమె కందిచ్చాడు, తన చందా మొత్తంగా.

ఆమె చిరునవ్వుతో దాని నందుకొని మనీపర్సులో పెడ్తూ,—

'గోపాలం యిచ్చిన దానికంటే యెక్కువ దానమే' అన్నది.

'దాని కేమి లెండి. మంచి కార్యము నేదైనా నిర్వహించడము మానవ విధి. దాని కేమి......అయితే గోపాలం తన నడవడి మార్చుకొంటున్నా డన్న మాట!' అన్నాడతను, ఆశ్చర్యము సూచిస్తూ.

ఆదుర్దాతో ఆమె తల పైకెత్తి,

'అదేమిటి, నడవడి మార్చుకోవడ మేమిటి? ఇది వరకల్లా గోపాలం.........'

'ఏమో లెండి, అదంతా నా నోటితో చెప్పడమెందుకు? ఒకళ్లను గూర్చి వాళ్లు లేనప్పుడసలు మాట్లాడకూడదు. ఎందు కొచ్చింది లెండి. ఏమో యిప్పటికైనా గోపాలం బుద్ధి కుదిరి.........'

'అదేమిటి? సంశయంలో వదిలేస్తే యెట్లా విషయం? విషయ మేమిటో చెప్పకపోతే యిదంతా నీవు కల్పించినట్లుగా భావించవలసి వస్తుంది. తప్పేమీ లేదు, చెప్పు.'

'ఇదిగో, మీరు తప్ప దన్నారు కాబట్టి చెప్తున్నాను. నా పేరు మాత్రం బయటకు రానీయవద్దు, దయ చేసి. గోపాలమంత కల్మషజీవి మరొకడు లేడు. తాను చెప్పే నీతులకు, చేసేపనులకు కొండంత వ్యత్యాసం. అతనితో నాకు కంటకముగా ఉన్నది.—'

'అట్లానా! తనయొక్క అమాయకత్వం నిరూపించే టందుకు కాబోలు, యిందాక నాయెదుట

యెన్నో సుభాషితము లాడాడే. ఇలాంటివాళ్లతో సంఘ మెట్లా వృద్ధిలోకి వచ్చేది......'

'ఎందుకు లెండి ఆగ్రహపడడం. మీరు స్వయముగా జూసినదాకా...'

'అదీ గాక, తన కేమో చాలాఆస్తి ఉన్నదనీ, అవుసర మైతే దాన్ని సంఘము కోసము వెచ్చింపడమునకు సిద్ధంగా ఉన్నాననీ చెప్పాడే?'

'అవు నట్లా చెప్పకపోతే యెట్లా? అదే ప్రస్తుత లోకం విధానం. తనకు భుక్తికి ఉంటే సంఘమున కిచ్చినంత ఫలం......'

'ఎంత అబద్ధమాడాడు; ఎటువంటి వాడు గోపాలం!..........సరే, నీవు వెళ్లిరా......సాయంకాలం తనిఖీకి వస్తాను.'

'చిత్తం, శెలవు...'అని వంగి సలాము చేసి జ్ఞానసుందరం నిష్క్రమించాడు. అన్నీ తన కనుకూలంగానే ఉన్నా యని లోపల సంతోషం.

౨

సౌభాగ్యం క్రిష్టియను. నాలుగేండ్ల క్రితమే భర్తను యీపాడు లోకంనుంచి పంపివేసింది. అట్లా జరిగిన తర్వాత జీవితం గడిచేమార్గం కనపడలేదు. అట్లా అల్లాడుతుండగా పట్నంలో Society for Encouraging Pure Living and Abstinence from Drinking. (నిర్మల జీవితమును, మద్యపాన నిషేధమును హెచ్చరించి వృద్ధిచేసే సంఘము) స్థాపించారు మిషన్ వారు. పట్నంలో హెడ్డాఫీసు. అక్కడక్కడ పల్లెటూళ్లలో చిన్న బ్రాంచి ఆఫీసులు. వాటిల్లో ఒక్కొక్కచోట కొద్ది వేతనంమీద యిద్దరు గుమాస్తాలు. వారు ప్రతివారం ఒక నియమిత దినాన మీటింగు చేసి గ్రామస్థులకు సంఘమువారు చెప్పినప్రకారం నీతిబోధన చేయవలె. ఇట్లా యేర్పరచిన తర్వాత గ్రామములో గుమాస్తాలు సరిగా పనిచేస్తున్నారో లేదో యని తనిఖీచేసేటందుకు కొద్దిజీతంమీద, బేటా, ప్రయాణపు ఖర్చులు యిచ్చి, సూపర్వైజర్లు. ఇటువంటి సూపర్వైజర్ పనే ఒకటి సంపాదించింది సౌభాగ్యం. అయిదో ఫారందాకా చదువుకున్నది. అందుచేతనున్ను, కొన్ని రెకమెండేషన్ల వల్లను ఉద్యోగ మిచ్చారు. నెలకు పాతిక రూపాయలు జీతం; పదిరూపాయిలు బేటా.

* * * * *

అట్లా ఉద్యోగరీత్యా తనిఖీనిమిత్తం సర్క్యూటు చేస్తూ ఆ ఊరు చేరుకుంది. అక్కడ సంఘం గుమాస్తాలు యిద్దరు_జ్ఞానసుందరం, గోపాలం. ఇద్దరూకూడా క్రిస్టియన్లే. ఇద్దరికీ నలభై యేళ్లకు తక్కువ ఉండవు. ఇద్దరూకూడా అవివాహితులే. జాతకంలో పెళ్లి గీత లేదనుకొని సర్దిచెప్పుకున్నారు తమకు తామే. ఏదో అట్లాగే తల, తోక ముడివేస్తూ జీవయాత్ర సాగిస్తున్నారు. అట్లా ఉండగా ఆగ్రామంలోకూడా సంఘం బ్రాంచి స్థాపించారు. ఆపర్యాడిలోనే వీరిద్దరకు గుమాస్తాపని దొరికింది. నెలకు పదిహేను రూపాయిలు జీతం. జీవితంలో వారి కది మహోత్కృష్టమైన సమయం. పనిలో జేరి యేదో వారికి తోచినట్లుగా సంఘంపని జరుపుతు, చేతకంటె మాటలు యెక్కువగా చెప్తూ కాలం పుచ్చుతున్నారు. యదార్థంగా ఆలోచిస్తే ఆసంఘంలో ఉండేటందుకు వారిద్దరిలో ఒక్కరికీ అర్హత లేదు!

* * * *

సూపర్వైజరు సౌభాగ్యంను లోకలుఫండుసత్రంలో దింపి, సహుపాయములన్నీ చేకూర్చారు జ్ఞానసుందరం, గోపాలం—యింటి దగ్గర యిద్దరకూ కూడా సంసారం లేదు కాబట్టి. ఆమె యింకా గ్రామంలోకి రాకపూర్వమే ఆమెనుగూర్చి అనేకవిచిత్రవార్తలు ప్రచారమైనవి. ఆమె గతించిన భర్త చాలాస్థితిమంతుడనీ, అతని అనంతరము ఆస్తి అంతా ఆమెకు లభించినట్లు, అయినప్పటికీ మానవసేవా పరాయణత్వాభిలాషతో సూపర్వైజర్ పనికి ఒప్పుకున్నదనీ, పెద్దపుకారు పుట్టింది. దానితో గుమాస్తాలిద్దరికీ నోరూరింది. ఆలోచన, యెత్తులు మొదలుపెట్టారు. అదివరకల్లా ఆషాఢభాద్రపదములల్లే ఉన్నయిద్దరూ రెండురోజులపూర్వంనుంచీ ఎడఎడంగా తిరుగుతూ యోచనలు ప్రారంభించారు. ఎవరికి వారు

ఆమెయెదుట భాగ్యవంతులుగాను, సంఘంపనిలో అసమాన ఉత్సాహం గలవారుగాను ప్రవర్తించి, ఏమాత్రం వీలైనా ఆమెను వివాహమాడి ఆమె ఆస్తినంతా లో బర్చుకుందామని నిశ్చయించుకున్నారు.

గ్రామంలోకి ఆమె రాగానే గోపాలం పోయి దర్శనం చేసుకొని, ఆమాటలు యీ మాటలు చెప్పి, తన యొక్క సదుద్దేశ్యములన్నీ ఒక్కగుక్కలో వెల్లడించి, తన కేమో కొంత ఆస్తి ఉన్నట్లు, అవుసర మైతే దానినంతా సంఘంకోసం ధారపొయ్యదల్చుకున్నట్టు సూచించాడు.

అతను వెళ్లినట్లు తెలియకుండా, అతను వెళ్లిన కొంతసేపటికే జ్ఞానసుందరం వెళ్లాడు సౌభాగ్యందర్శనార్థము. గోపాలంకంటె కొంచెం తెలివైన ఘటం. సమయానుకూలంగా మాట్లాడి పనిచేసే కుశాగ్రబుద్ధి అప్పుడప్పుడు కల్గుతుంది......ఆమెతో మాట్లాడుతు, గోపాలం విషయం విని అతనియెత్తు కనిపెట్టి, గుంభనగా అతనిశీలమును సంశయంగా వెలిబుచ్చి, తనయొక్క ఔదార్యం చూపేటందుకు పదిరూపాయిలు విరాళం యిచ్చాడు.

అప్పుడే గోపాలంయందుకంటె జ్ఞానసుందరమందు సౌభాగ్యానికి కొంత అభిమానము, కొంతగౌరవము, కొంత గురి కుదిరింది. ఇంకేం, అతని అదృష్ట మట్లా ఉన్నది.

*   *   *   *   *

3

తన యింటి ముందు వసారాలో కూర్చుని జ్ఞానసుందరం ఏవో కాగితములు చూచుకుంటున్నాడు. ఉసూరుమంటూ గోపాలం ప్రవేశించి,

‘పోతోంది ప్రాణం; ఇహ ఆగదు’ అన్నాడు.

‘ఏమిటి గోపాలం, ఏమిటి విషయం?’

‘ఏమున్నది. వచ్చి రెండురోజు లైనా సూపర్‌వైజరు ఊళ్లోనుంచి పోదాయె. ఈ రెండు రోజుల్లోనూ గ్లాసెడు కాదుగదా గుక్కెడు పుచ్చుకుందామన్నా ఏమాత్రం వీలు లేకుండా ఉన్నది. ఏనిముషంలో పిలుస్తుందో, యేమో. అది కాస్తా బయటపడితే ఉద్యోగానికి స్వస్తి....అబ్బబ్బ, ప్రాణం ఎగిరిపోయే టట్టుంది.’

‘అదేమిటి గోపాలం, ఎందు కంత భయపడుతావు? ప్రాణంకంటె యెక్కువేమిటి ఉద్యోగం? ఇంతకూ కాస్త రహస్యంగా పుచ్చుకుంటే ఆవిడెకు తెలియవచ్చేం దేమిటి? పోనీ, అంతభయమైతే తెప్పించి యిక్కడ పుచ్చుకో, రహస్యంగా జరిగిపోతుంది.’

‘ఏమో సుందరం, ధైర్యం చాలదు......’

‘అబ్బే, యిందులో ధైర్యాని కేమున్నది? నేను చేస్తానుండు’ అని లేచి యింటి యెదుట దుకాణములో నుంచి తానే స్వయముగా సారాయి తెచ్చి గోపాలానికి అందిచ్చాడు. వెనుక ముందు ఆలోచన లేకుండా తనివి తీరేటట్టుగా త్రాగాడు. ఆ తొందరలో జ్ఞానసుందరాన్ని గూడా పుచ్చుకోమని మర్యాదచేయడం గూడా మరచిపోయినాడు గోపాలం. పుచ్చుకోడం పూర్తి అయిన తర్వాత మత్తెక్కి పడిపోయినాడు. ఆసమయం చూచి జ్ఞానసుందరం పరుగెత్తుతూ పోయి సౌభాగ్యాన్ని వెంటబెట్టుకుని తనయింటికి వచ్చాడు. ఆమె చూసే సరికి తప్ప త్రాగిఉన్న గోపాలం పిచ్చిమాటలాడుతూ, దాసీదానితో అధికప్రసంగం చేస్తున్నాడు. సౌభాగ్యం కనుపడే సరికి గోపాలం వణుకుతూ ప్రక్కద్వారంలోనుంచి పలాయితుడైనాడు.

దీర్ఘ నిశ్వాసం విడిచి, సౌభాగ్యం ప్రక్కనున్న జ్ఞానసుందరం వంక చూచింది. అత నేమీ యెరుగనట్లుగా దీనముఖుడై,

‘చూచారా, మీరే స్వయంగా?’ అన్నాడు.

సౌభాగ్యం కళ్లల్లో తృప్తి తాండవ మాడింది. అతని దగ్గరగా వచ్చి,

‘నిజంగా నీమోస్తరు మనిషి నాకు యెక్కడా కన్పడలేదు. నీవంటివా రుండ బట్టే యీ సంఘం యింత మాత్రమైనా నిల్చి ఉండగలిగింది. నీ విప్పుడు చేసినపని అమోఘము. యథార్థంగా నీవోటివారి సహాయంతో ఎన్ని మంచి కార్యములైనా చేయవచ్చు’—అంటూ అతనికి ‘షేక్‌హాండ్’ యిచ్చింది.

జ్ఞానసుందరం శరీరం జలదరించింది; కాని ముఖం విప్పారింది. గెలుపు అప్పుడే నిగనిగలాడించి మాపుల్లో:

'ఏమిటో లెండి. మీబోటివారు మెచ్చుకోవలసిందే. జనసామాన్యమునకి వన్నీ అర్థముకావు. "యదార్థవాదీ లోకవిరోధీ" అన్నట్లు నిజం చెప్తే నిష్ఠూర్యము...'

అట్లా మాట్లాడుకుంటూ యిద్దరూ సత్రం జేరారు. అంతలోనే చీకటి పడ్డది. జ్ఞానసుందరం ఆమె దగ్గర శెలవు తీసుకుంటున్నాడు. అప్పుడే నౌకరు భోజన పదార్థములు తీసుకువచ్చాడు.

'ఇప్పు డొక్కడవు చీకట్లో వెళ్లకపోతే యిక్కడే భోజనం చేయరాదూ, జ్ఞానసుందరం?'

'చిత్తం, చిత్తం. దానికేం లెండి, చిత్తం—,' అంటూ నీళ్లు నమిలాడు అతను. లోపలమాత్రం ఉబ్బిపోయినాడు.

'అలా కాదు. తప్పేమీ లేదు. భోజనం చేయవచ్చు.'

'చిత్తం, అలాగే' అన్నాడు తెగించి.

ఆరాత్రి సౌభాగ్యం, జ్ఞానసుందరం విందారగించారు. ఈపాటి కప్పుడే పరిచయం కొంచెం యెక్కువ అవడముచేత యిద్దరూ అనేక విషయములను గూర్చి ముచ్చటించారు, నిద్ర వచ్చేవరకు.

* * * * *

౪

ఇక తక్కినదంతా తేలిక విషయమే, జ్ఞానసుందరానికి. తనిఖీ పూర్తి కాలేదనే నెపంమీద మరొక నాలుగురోజులు ఆగ్రామంలోనే ఉండడమునకు నిశ్చయించుకున్నది సౌభాగ్యం......సత్రంలో వరుసగా మూడురోజులకన్న యెక్కువ ఉండనీరనే కారణంవల్ల తన మకామంతా జ్ఞానసుందర మింట్లోకి మార్చింది....

ఒకరోజు యిద్దరు కలిసి గ్రామం బయటకు షికారుగూడా వెళ్లారు.

ఊరిలోనుంచి అయిపు లేకుండా పోయినాడు గోపాలం.

* * * * *

వారి సంభాషణలలో యెప్పుడూ యెక్కువగా వారి వారి ఆస్థుల సంగతి వచ్చేది. ప్రథమంలో జ్ఞానసుందరం తనకున్న ఆస్థినిగురించి చెప్పినమాటలు జ్ఞాపకముంచుకుని సౌభాగ్యం

'ఏం చేద్దాం, ఆస్తితో—'అంటూండేది.

ఇదంతా గమనిస్తే సౌభాగ్యం తనఆస్తినంతా తిరిగి తాను గంగాభాగీరథీ సమాన రాలయ్యేవరకు దాచుకునే ఉద్దేశ్యముతో ఉన్నట్లుగా కన్పడ్డది, జ్ఞానసుందరానికి.

ఏదెట్లా ఉన్నా వివాహబంధం బిగిసిన తరువాత విచారింపవచ్చు తక్కిన విషయము లనుకుని సమాధానపడ్డాడు అతను.

* * * * *

మహాసుదిన మది, యిద్దరకు. ఉదయం సుమారు ఏడుగంట లైంది. సూపర్వైజరు, గుమాస్తా చర్చిలో హాజరైనారు.

ఆసనయంలో జ్ఞానసుందరం కాబోతున్న తన భార్య-సౌభాగ్యం-శంక దృష్టిని పోనిచ్చేసరికి యెక్కడలేని ధైర్యస్థైర్యములు తెచ్చిపెట్టుకోవలసి వచ్చింది. ఆ మాత్రం నిబ్బరం గలవాడు కాబట్టే ప్రాణం ఆగటించలేదు. ఎక్కువగా ఆమెవైపు మాడవద్దని తీర్మానించుకున్నాడు.

సౌభాగ్యంగూడా పాపం, పూర్వపువిచారమంతా దిగమ్రింగి, కేవలం సంఘసేవ కోసం చేయబోతున్న త్యాగముకోసం, ఇమిటేషన్‌చీర కట్టుకుని, ముడిపడని పొట్టివెంట్రుకలను గూడా గట్టిగా అణచికట్టి, ముఖంలో ఉన్న రెండు మూడు ముడుతచారలు కన్పడకుండా కొంత భస్మం అద్ది, ఎంతో అవస్థపడ్డది.

ఇద్దరూ దగ్గరగా నిల్చున్నారు. నలభై యేళ్ల వరుడు, ముప్పైయేళ్ల వధువు......ఫాదరీ పావన సలిలం శిరస్సునచిలకరించాడు. భార్యాభర్తలుయిర్వురు మెల్లగా యిల్లు చేరారు. జ్ఞానసుందరం పెద్దశ్వాస వదిలాడు.

* * * * *

తమయొక్క పరిణయమహోత్సవ సందర్భములో యేవిధమైన విందుగాని, ఆర్భాటంగాని చేయవద్దని దంపతులు ఏకగ్రీవంగా తీర్మానించుకున్నారు. అదంతా అనవసరవ్యయముని వారితలంపు.

అందుచేత ఆరాత్రి వారిద్దరుమాత్రమే బల్లదగ్గర కూర్చుని భోజనమున కుపక్రమించారు.

'ఎట్లా పరిణమించింది వ్యవహారం, సౌభాగ్యం!'

'అంతా దైవకృతం. ఇట్లా పరిణమించినందుకు మన అభీష్టసిద్ధి అయినట్లయితే......'

'ఏమి టది?'

'ఏమున్నది? నీకున్న ఆస్తితో మనయిద్దరి జీవితం సాగిపోతుంటే పరాలోచన లేకుండా సంఘం విషయమింకా యెక్కువగా శ్రద్ధ వహించి కృషిజేయవచ్చు...'

జ్ఞానసుందరం గుండెలో రాయి పడ్డది. వెర్రి చూపుతో,

'అయితే సౌభాగ్యం నీడబ్బుతో......'

'అమ్మో, సుందరం, నాకు డబ్బెక్కడిది? డబ్బే కనుక ఉంటే యీ పనికిమాలిన నౌకరీ యెందుకు చేస్తాను......నీవో............'

'అమ్మో, సౌభాగ్యం, నేనూ అంతే...అమ్మో, మెడకు ఉరి.........పడ్డాను బోల్తా, పెద్దబోల్తా!...'

సీతువు

విద్వాన్. డి. రామమూర్తిశాస్త్రిగారు

జనుల కుశలమె మదిఁ గోరి సరసగతిని
జీవనము నిడి మన్ననం జెంది మేఘుఁ
డరుగఁగా నేఁడు సీతువ, సరసమాన
సముల నింకింప దొరఁకొంటి సరసమె యిది.

ఈగి లేకున్న జనులకు సేగి లేదు
కాని పరదత్తజీవన హానిఁ జేయఁ
దగదు తగ దిది నిక్క మధర్మసరణి
జడుఁడ వీ వౌట సీతువ, చాల వెఱుఁగ.

నీరజము లేమి చేసెను నీకు నకట
పద్మినీకాంత నిన్నేమి బాధపెట్టె
నల గులాబియు నీ కేమి హాని చేసెఁ
బెట్టికొంటి వదేల నీ పొట్ట వాని.

నీవు క్రౌర్యము పూనిన న్మావిహృదయ
పల్లవితభావము న్వయల్పఱుపకుండ
మనుచు నెప్పటి యట్టులె మాన్యసద్వి
జాళిసచ్ఛీల మరయఁగ నట్టిదె కద.

నకనకంబడు నక్కపైన్దాటిపండు
నలఁదిపిచ్చుకమీఁద బ్రహ్మాస్త్రమువలెఁ
గా దనక మూర్ఖతను బీద సాదులపయిఁ
జూపుదువు సీతువా, నీప్రతాప మయ్యో.

లలి సుమనో ధర్మమ్ముల
దులుపుట జాడ్యంపుటీఁద దుర్భరసరణిన్
నెలకొల్పుట నీకును నల
కలికిని నైజమ్ము శీత కాలమ కాదే.

క్రాలుదును నే నిదే రీతిఁ గాల మెల్ల
నని తలంచెదు శాశ్వత మరయ నేది?
షోడ వడంగించి నిన్నును బొరిగొనుటకుఁ
బొంచియున్నది వేసవి కొంచె మెఱుఁగు.

కాల మెల్లను నీరీతిఁ గ్రాలఁదలఁచి
తేని సాధింపు శక్తిమై దివ్యధాము
దైవవిధి నైతి శక్తుఁడ వీవు నేఁడు
వాని సాధింప నీ కింక వశమె తలఁప?

సర్వమును బల్లవింప నఖర్వగతిని
మహి సరగ సుమనోభి రామముగఁ జేసి
మన్ననం బొంద మాధవుఁ డున్నవాఁడు
ఖలుఁడె సజ్జనగౌరవ కారణుఁడుగ.

చిగురుమోవుల కొకవింత సొగసు కూర్చి
మోముఁదమ్ముల కామోదమును ఘటించి
యాశ్రితాళికి మధురసాహారము నిడి
మోము వాఁ డుద్భవింపక యుండునె యిఁక!